క్లుప్తంగా

విస్తృతంగా వాహనాల తనిఖీ



ఎన్‌ఏడీ జంక్షన్‌లో ఆటోని తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ వాసుదేవరావు, సిబ్బంది

గోపాలపట్నం: ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనపై వేసిన చలానాలు కట్టకుండా తిరుగుతున్న వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు గట్టి నిఘా పెట్టారు. ఎన్‌ఏడీ జంక్షన్‌లో సోమవారం కంచరపాలెం ట్రాఫిక్ ఎస్‌ఐ వాసుదేవరావు, ఏఎస్‌ఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ద్విచక్రవాహనాలు, ఆటోలను తనిఖీ చేశారు. లాంగ్ పెండింగ్ ఉన్న వాహనదారుల నుంచి చలానాలు వసూలు చేశారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని లేని పక్షంలో కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నియంత్రణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

రెయిన్ కోట్లు పంపిణీ



సిబ్బందికి రెయిన్ కోట్లు అందిస్తున్న సీఐ అశోక్ కుమార్

గోపాలపట్నం: గోపాలపట్నం ట్రాఫిక్ సిబ్బందికి సీఐ అశోక్ కుమార్ మంగళవారం రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. నిత్యం ఎండ, వానలో విధులు నిర్వహించే ట్రాఫిక్ సిబ్బంది రక్షణ కోసం బెహరా ఆస్పత్రి ఎండీ డాక్టర్ రవి తేజ వీటిని సమకూర్చారన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాసరావు, ఇబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ కెనరాబ్యాంక్ వెనుక చట్టివానిపాలెంలోని ఓ ఇంటి వరండాలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. గాజువాక ఎస్‌ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. చట్టివానిపాలెంలో చెల్లిబోయిన అప్పలనర్సమ్మ ఇంట్లో చంటి అనే క్రేన్ ఆపరేటర్ రెండు నెలలుగా అద్దెకు ఉంటున్నాడు. అతని భార్య చిన్నమ్మలు వారం రోజులుగా ఊళ్లో లేదు. రెండు రోజులుగా అతడు వరండాలో పడుకుని లేవకపోవడం, దుర్గంధం రావడంతో మృతి చెందినట్లు గుర్తించిన స్థానికులు సోమవారం రాత్రి గాజువాక పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ సతీష్ వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

యువతపైనే దేశ భవిత



సమావేశంలో మాట్లాడుతున్న ఏయూ రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: యువతపైనే దేశ భవిత ఆధారపడి ఉందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే బాధ్యత అధ్యాపకులదేనన్నారు. ఏయూ జాతీయ సేవా పథకం సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన యువజన అభివృద్ధి రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. జాతీయ సేవా పథకం యువతను మార్పునకు సాధనాలుగా తయారు చేయాలని, తద్వారా వారిని నిపుణులైన మానవ వనరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. సామాజిక కార్యకర్త ఆచార్య కె.శేఖర్ మాట్లాడుతూ యువతకు కెరీర్ కౌన్సెలింగ్ ఎంతో అవసరమన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఈ దిశగా యువతకు మార్గనిర్దేశం చేయాలన్నారు. యువతలో నైపుణ్యాలను వృద్ధి చేయాలని, దేశానికి సంపద సృష్టించే ప్రక్రియలో వారిని భాగస్వాములు చేయాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా యువత - మత్తు పదార్థాలు, యువత-రిస్క్ బిహేవియర్, యువత-మాతృభాషలో విద్యాబోధన, యువత-సామాజిక మాధ్యమాలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఎస్.హరనాథ్, జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి. ఎస్. భాగ్యలక్ష్మి, విజయనగరం జిల్లా ప్రోగ్రాం అధి కారి చంద్రశేఖర్, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

గురువులపై గురుతర బాధ్యత

సమాజంలో గురువు స్థానం మహోన్నతమైనది.. విలువలతో కూడిన విద్య అందించి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది... ఉపాధ్యాయుడిగా జీవితం ప్రారంభించి దేశ ప్రథమ పౌరుడి స్థాయికి ఎదిగిన సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఉపాధ్యాయులు పని చేయాలని వక్తలు పేర్కొన్నారు. సర్వేపల్లి జయంతిని పురస్కరించుకుని పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులను సత్కరించారు.

- ఉపాధ్యాయ దినోత్సవంలో వక్తలు
- సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘన నివాళి



పౌర గ్రంథాలయంలో రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి నరసింహం



గోపాలపట్నం హైస్కూల్‌లో..



చిత్రకారుడు భాస్కరరావును సత్కరిస్తున్న దృశ్యం

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని జీవీఎంసీ, ప్రైవేట్ పాఠశాలల్లో టీచర్స్ డే వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు సంప్రదాయ, నూతన వస్త్రాలు ధరించి పాఠశాలకు వెళ్లారు. గురువులకు పాదాభివందనాలు చేసి వారి ఆశీర్వచనాలు పొందారు.

- జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం జీవీఎంసీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో ఉపాధ్యాయులతో పాటు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి శ్రమించిన ఉపాధ్యాయులను సత్కరించారు.
- శ్రీహరిపురం, నక్కవానిపాలెం, ఇండస్ట్రియల్‌కాలనీ,ప్రకాష్‌నగర్ జీవీఎంసీ పాఠశాలలతో పాటు లక్కీ, అమర్,సరస్వతి విద్యావిహార్,భాష్యం,ఏవీకే, నాగేంద్ర, విజ్ఞాన్ టాలెంట్ పాఠశాలల్లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో విద్యార్థులు సందడి చేశారు.వారికి చదువులు చెప్పే ఉపాధ్యాయులను సన్మానించారు.

గోపాలపట్నం: గోపాలపట్నం, ఎన్ఏడీ ప్రాంతాల్లోని పాఠశాలల్లో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

- గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులకు పాద పూజలు చేశారు.



సుబ్బారెడ్డి చేతుల మీదుగా సత్కారం అందుకుంటున్న వాసు

- గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో గురుపూజోత్సవం పురస్కరించుకుని విద్యార్థులు ఉపాధ్యాయుల అవతారమెత్తారు.
- పౌర గ్రంథాలయంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధా కృష్ణన్ చిత్రపటానికి గ్రంథాలయాధికారి ఎన్‌వీ నరసింహం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓంకార్, విష్ణుమూర్తి, శివాజీ, బాలాజీ, సూర్యకళ, శ్యాంసుందర్, నవీన్, వనజ, తనూజ తదితరులు పాల్గొన్నారు.
- నరవ బెహరా విద్యాసంస్థల్లో విద్యాసంస్థల డైరెక్టర్ బెహరా విజయచైతన్య సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.పలువురి అధ్యాపకులను సత్కరించారు.
- నరవ విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్ సర్వేపల్లి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఆర్పీపేటలో..

కంచరపాలెం: రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏపీ ఐడీసీ డైరెక్టర్ కాయిత వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కాయిత పైడిరత్నాకర్ ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హెచ్‌ఎం శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.



నరవ బెహరా కళాశాలలో ..



మల్కాపురం పాఠశాలలో ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న అతిథులు

ప్రతిభకు నగదు ప్రోత్సాహకం

సింధియా: హిందుస్థాన్ షిప్‌యార్డ్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు 10వ తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించారు. వారిని ప్రోత్సహిస్తూ ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ తరఫున వరుసగా రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేల నగదు ప్రోత్సాహకం అందించారు. టాపర్‌గా నిలిచిన విద్యార్థి ఉన్నత చదువులకు తమ ట్రస్ట్ తరఫున సహకారం అందిస్తామన్నారు. అనంతరం గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల ఉపాధ్యాయులు, షిప్‌యార్డ్ కళాశాల ప్రిన్సిపాల్ బి.సర్వేశ్వరరావు, స్కూల్ హెచ్‌ఎం సుగుణవతి, కళాశాల గోల్డెన్ జూబ్లీ కమిటీ (ఎఫెక్స్) సభ్యులు, స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ జీఎం రామ్మోహన్, వర్మరాజు, ఆంథోని, గాంధీగ్రామ్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు సదాశివను ఘనంగా సత్కరించారు.

- ఎన్‌ఏడీలోని రామకృష్ణ పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పాఠశాల డైరెక్టర్ రామకృష్ణా రెడ్డి, ఐటీఐ అసిస్టెంట్ డైరెక్టర్ దుర్గయ్య పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉత్త ఉపాధ్యాయులుగా ఎంపికైన సీహెచ్ గంగాభవాని, అనురాధ, అమరేంద్రరెడ్డిలను సత్కరించారు.



మల్కాపురం జీవీఎంసీ పాఠశాలలో టీచర్స్ డే వేడుకలు



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందిస్తున్న దృశ్యం



సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రామకృష్ణారెడ్డి తదితరులు

మార్గనిర్దేశకులు ఉపాధ్యాయులు



ప్రసంగిస్తున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, చిత్రంలో ఆనంద్‌కుమార్ తదితరులు

- వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- విశాఖ డెయిరీ స్కూల్ ఆడిటోరియంలో వైభవంగా గురుపూజోత్సవం
- 120 మంది ఉపాధ్యాయులు, 600 మంది విద్యార్థులకు పురస్కారాలు



హాజరైన ఉపాధ్యాయులు, నాయకులు

గోపాలపట్నం: గురువును మించిన దైవం లేదని ఉమ్మడి విశాఖ జిల్లాల వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త, ఎంఎస్ఎంఈడీసీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం విశాఖ డెయిరీ స్కూల్ ఆడిటోరియంలో గురుపూజోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన వైవీ సుబ్బారెడ్డి, వైఎసార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఆనంద్‌కుమార్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు భవిష్యత్తు తరాలకు మార్గ నిర్దేశకులని కొనియాడారు. అందుకే గురువులను దైవంతో పోల్చారన్నారు. నేటి యువత రేపటి దేశ భవిష్యత్తుకు దోహదపడాలని ఆకాంక్షించారు. అందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. నాడు- నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అత్యుత్తమ ప్రమాణాలతో తీర్చిదిద్దారని చెప్పారు. అమ్మ ఒడి ద్వారా బడి ఈడు పిల్లలు బడికి తరలి వచ్చేలా చేశారన్నారు. విద్యార్థులు ఏ స్థాయికి వెళ్లినా ఉపాధ్యాయులతో పాటు చదువుకున్న పాఠశాలను మరువరాదని సూచించారు.

ఉపాధ్యాయులు, విద్యార్థులకు పురస్కారాలు...

పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని పాఠశాలల్లో పని చేస్తున్న 120 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసిన జ్ఞాపికలతో పాటు నగదు పురస్కారాలు అందించారు. అలాగే పదో తరగతిలో 500 మార్కులు దాటి సాధించిన విద్యార్థులకు, ఇంటర్‌లో 900 మార్కులు దాటిన విద్యార్థులతోపాటు ఐసీఎస్సీ, సీబీఎస్సీ విద్యార్థులకు మొత్తంగా 600 మందికి ప్రశంసాపత్రాలు, నగదు ప్రోత్సాహకాలు అందించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీ తత్వం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల ఉన్నతికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయాలను నెరవేర్చే గురుతర బాధ్యత ఉపాధ్యాయులు, విద్యార్థులపై ఉందని తెలిపారు.

పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు మాట్లాడుతూ ఈ కార్యక్రమం విద్యార్థులు, ఉపాధ్యాయులకు మధుర జ్ఞాపకంగా నిలిచి పోతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ పరిశీలకులు ఎస్ఏ రెహ్మాన్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, మహిళా నాయకురాలు పేడాడ రమణ కుమారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్ కృష్ణ, వార్డు కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వైవీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా పురస్కారాలు అందుకుంటున్న ఉపాధ్యాయులు

ఐక్యపోరాటాలతోనే ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ

- ఆల్ ఇండియా ఖేత్ మజ్దూర్ కిసాన్ సభ కో-కన్వీనర్ ఝాన్సీ
- ఉక్కు పరిరక్షణ దీక్షలకు సంఘీభావం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఝాన్సీ

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించాలన్న బీజేపీ ప్రభుత్వ ధోరణిని ఐక్యంగా ఎదుర్కోవాలని ఆల్ ఇండియా ఖేత్ మజ్దూర్ కిసాన్ సభ కో-కన్వీనర్ ఎస్.ఝాన్సీ అన్నారు. సంస్థలను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 936వ రోజు మంగళవారం ఆమె దీక్షలకు సంఘీభావం తెలిపారు.ఐక్య పోరాటాలతోనే ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ సాధ్యపడుతుందన్నారు. మోదీ పాలనలో ప్రభుత్వరంగం మరింత బలహీనపడిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన విధానాలను మార్చుకోకపోతే భారీ మూల్యం చెల్లించకోక తప్పదన్నారు.

12, 13 తేదీల్లో సదస్సు

అటవీ సంరక్షణ చట్ట సవరణను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 12, 13 తేదీల్లో నగరంలోని రైల్వే న్యూకాలనీలో అఖిల భారత ఆదివాసీ సదస్సును నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. కార్మికులు పాల్గొని ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

హరియాణా ప్రభుత్వ తీరుపై ఆశ వర్కర్ల ఆందోళన



బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆశ వర్కర్లు

గోపాలపట్నం: హామీలు నెరవేర్చాలని ఆందోళన చేస్తున్న ఆశవర్కర్లను హరియాణా ప్రభుత్వం బలవంతంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమని ఆశ వర్కర్లు మండిపడ్డారు. ఆ రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ వద్ద ఆశవర్కర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకురాలు అనసూయ మాట్లాడుతూ గత నెల 29 శాంతియుత ర్యాలీ చేస్తున్న ఆశ వర్కర్లు, సీఐటీయూ నాయకులపై హరియాణ పోలీసులు దారుణంగా వ్యవహరించారని విమర్శించారు. తప్పుడు కేసులు ఉపసంహరించాలని కోరారు. కార్యక్రమంలో వి. మేరి, కె. కనకదుర్గ, శిరీష, అరుణ, పుష్పలత, లావణ్య, తోటమ్మ పాల్గొన్నారు.

నూతన పింఛన్ల అందజేత



కొత్త పెన్షన్ అందజేస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు పరిధి జ్ఞానాపురం కాయిత మరియదాస్ కమ్యూనిటీ హాల్లో మంగళవారం కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ, జేసీఎస్ అర్బన్ క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీధర్ ముఖ్య అతిథులుగా వైఎస్సార్ ఆసరా పెన్షన్ కానుకను అందజేశారు. అక్క చెల్లెమ్మలు, దివ్యాంగులకు కొత్తగా మంజూరైన పెన్షన్లు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చల్లని మనసుతో వార్డులో 20 మందికి కొత్త పెన్షన్లు అందించడం ఎంతో ఆనందంగా ఉందని కార్పొరేటర్ పూర్ణిమ అన్నారు. కార్యక్రమంలో ఏపీడీ పద్మావతి, సీవో గణేష్, వేళంగణిరావు, అన్నపూర్ణదేవి, ఈశ్వరి, ఆనంద్, రజిని శ్రీను, శ్యాంసుందర్‌రెడ్డి, కమల, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీ



కాంతంకు పింఛను అందిస్తున్న గోపి, మురళీకృష్ణ

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు రజక కాలనీకి చెందిన జి. కాంతం అనే మహిళకు ఏటీఆర్ ట్రస్ట్ సమకూర్చిన పింఛన్‌ను వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌ను రజక కాలనీకి చెందిన వారు మర్యాదపూర్వకంగా కలిశారన్నారు. కాలనీకి చెందిన గోగులమట్టం కాంతం అనే మహిళకు సాంకేతిక కారణాల వల్ల పింఛను అందడం లేదని దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. దీంతో ప్రభుత్వ పింఛను మంజూరయ్యేలా చూస్తానని అంతవరకు సొంత నిధులతో పింఛను అందిస్తానని మాట ఇచ్చారు. ఆ మాట ప్రకారం ఏటీఆర్ ట్రస్ట్ ద్వారా పింఛను మంజూరు చేశారన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

20వ రోజుకి శ్రావణలక్ష్మి పూజలు

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు మంగళవారం 20వ రోజుకి చేరాయి. ఉదయం 8 గంటలకు వేద మంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. శ్రావణలక్ష్మి పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో కె. శిరీష తెలిపారు. పూజలకు సంబంధించి వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె బాట

దాబాగార్డెన్స్ : సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి గడువు ముగిసినప్పటికీ ఏ ఒక్క సమస్య పరిష్కరించకపోవడంతో ఈ నెల 15 నుంచి మున్సిపల్ కార్మికులు సమ్మె బాట పట్టనున్నారని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి. వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉరికిటి రాజు, అధ్యక్షుడు నూకరాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం సిటు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జూన్ 16న కార్మిక డిమాండ్లపై జరిగిన ఒప్పందం సందర్భంగా తాత్కాలికంగా సమ్మె వాయిదా వేశామన్నారు. గత నెల 31లోగా మొత్తం 38 డిమాండ్లు పరిష్కరిస్తామని మున్సిపల్ అధికారులు హామీ ఇచ్చారని, గడువు ముగిసినప్పటికీ ఏ ఒక్క డిమాండ్ పరిష్కరించలేదని, సమస్య లు వెంటనే పరిష్కరించకపోతే ఈ నెల 15 నుంచి మున్సిపల్ కార్మికులు సమ్మె బాట పట్టనున్నారని తెలిపారు. పారిశుధ్య విభాగంలో ఖాళీగా ఉన్న పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 జీతం, ఆప్కాస్‌లో చేర్చడం, యూజీడీ, పబ్లిక్ హెల్త్ డ్రైవర్లు, వెటర్నరీ, మలేరియా కార్మికులకు హెల్త్ అలవెన్స్ చెల్లించాలని, జనాభా, విస్తీర్ణం ఆధారంగా సిబ్బందిని పెంచా లని తదితర పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్. రమణ, జె. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముగింపు సభను జయప్రదం చేయండి

అల్లిపురం : రాష్ట్రాన్ని రక్షించుకుందాం.. దేశాన్ని కాపాడుకుందాం అన్న నినాదంతో సీపీఐ చేపట్టిన రాష్ట్రస్థాయి బస్సు యాత్ర ఈ నెల 8న తిరుపతి సభతో ముగుస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తెలిపారు. బస్సుయాత్ర ముగింపు సభ ప్రచార పోస్టర్‌ను మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఎస్వీ హై స్కూల్ గ్రౌండ్ నుంచి తిరుపతి మున్సిపల్ గ్రౌండ్ వరకు ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం జరిగే బహిరంగ సభలో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి కె. నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కే రెహమాన్, సీఎస్ క్షేత్రపాల్, పి.చంద్రశేఖర్, నాయకులు జేడీ నాయుడు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు కింద పడి వృద్ధురాలి మృతి

అల్లిపురం : ఆర్టీసీ బస్సు కింద పడి గుర్తు తెలియని వృద్ధురాలు ఆదివారం సాయంత్రం మృతి చెందింది. ద్వారకాబస్ స్టేషన్ వద్ద భిక్షాటన చేసుకునే ఆమె ప్రమాదవశాత్తు 38 హెచ్ బస్ కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. సుమారు 5 అడుగుల ఎత్తు కలిగిన ఆమెను గుర్తించిన వారు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ బి.తిరుమలరావు కోరారు. ఆచూకీ తెలిసిన వారు 9440904716, 9908001600 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

వడ్లపూడిలో చోరీ



బీరువాలో సామగ్రి చిందర వందరగా పడేసిన దృశ్యం

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడిలోని ఓ ఇంట్లో దొంగలు చొరబడి, నాలుగున్నర తులాల బంగారం, అరకేజీ వెండి అపహరించారు. దువ్వాడ క్రైం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వడ్లపూడి తెలుకల వీధిలో ఫార్మా ఉద్యోగి రొంగలి మోహనరావు కుటుంబంతో నివాసముంటున్నారు. అగనంపూడిలో కొత్త ఫ్లాట్ కొనుగోలు చేసిన వారు గృహప్రవేశం చేసేందుకు ఈ నెల 1న అక్కడికి వెళ్లారు. మూడు రాత్రులు నిద్ర చేయాలన్న ఆచారం ప్రకారం అక్కడే ఉండి, 4వ తేదీ రాత్రి వడ్లపూడి తిరిగి వచ్చే సరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. బీరువా తెరిచి వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో ఇంట్లో చోరీ జరిగిందని గుర్తించిన మోహనరావు దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైం సీఐ సూర్యనారాయణ, ఎస్ఐ కాళిదాసు సిబ్బందితో కలిసి వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బీరువాలోని నాలుగున్నర తులాలు బంగారు ఆభరణాలు, అర కేజీ వెండి అపహరించినట్లు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.